
గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సీతారాములు

ఆనందనందనుడు..

అయోధ్య రామచంద్రుడు

అయోధ్య సంబరాలు.. సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణాలు

- శోభాయాత్రలు, భజనలు, హోమాలు, అన్నప్రసాద వితరణ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో అంతటా 'రామమయం'గా మారింది. తెల్లవారుజాము నుంచే 'జైశ్రీరామ్.....జైజైశ్రీరామ్' నినాదాలతో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని ఆలయ ప్రాంగణాలు, వీధులన్నీ మారుమ్రోగిపోయాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను పూలు, మామిడిఆకులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రం, జీపీఆర్ఏ క్వార్టర్స్ఆలయం, టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయం, చందానగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుడాట్రేడ్‌సెంటర్ ఆలయం, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలో రంగనాథస్వామి ఆలయం, భెల్ ఎంఐజీ కాలనీలోని రామాలయం, గోపన్‌పల్లితండా, లింగంపల్లి, మక్తామహబూబ్‌పేట్, రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ,హఫీజ్‌పేట్, మియాపూర్, చందానగర్,కొండాపూర్, కొత్తగూడ, మాదాపూర్, సాయినగర్ ప్రాంతాలలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. నాయకులు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాలు..

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్, కొండాపూర్ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలలో ఆలయాలలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారాలు చేయడంతో అధిక శాతం భక్తులు ఆలయాల్లో తిలకించారు.

నిత్య హోమం ప్రారంభం

ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమం ఆలయంలో నిత్య అగ్ని హోమాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శోభాయాత్ర

కనుల పండువగా రాములవారి కల్యాణం

పటాన్‌చెరు టౌన్: అయోధ్యలో ఐదు శతాబ్దాల స్వప్నం సాకారమయ్యిందని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానం, శ్రీ పంచముఖి హనుమాన్ దేవస్థానం, శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో ఉదయం ఐదు గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయాల్లో అయోధ్యలో జరిగిన ప్రాణప్రతిష్ఠ వీక్షించేందుకు భక్తులకు ఎల్‌ఈడి తెరలను ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు పట్టణం లోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవస్థానంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ దంపతులు స్వామివారి కల్యాణం చేశారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఊరేగింపులు, బైక్ ర్యాలీలు

పటాన్‌చెరు మండలం ఇంద్రేశం సిటిజన్ కాలనీలో సాయిబాబా దేవస్థానం సమీపంలోని శ్రీ వరసిద్ధి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ చారి, సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ కోదండ సీతారామస్వామిని ఊరేగించారు. అమీన్‌పూర్ పట్టణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి గోశాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీరంగూడ కమాన్ నుంచి గోశాల వరకు సుమారు 600 బైకులతో ర్యాలీ ఘనంగా నిర్వహించారు.


శేరిలింగంపల్లిలో సగర సంఘం శోభాయాత్ర


జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో స్వామి వారి పల్లకీసేవ


ఖాజాగూడలో అన్నప్రసాద వితరణ


గచ్చిబౌలిలోని నాగార్జున రెసిడెన్సీ గేటెడ్ కమ్యూనిటీలో ..


ఖానామెట్‌లో బైక్ ర్యాలీ


పటాన్‌చెరులో..


భెల్ ఎంఐజీ కాలనీలో..
విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న భక్తులు


గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయంలో ..
కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు


ఎల్లమ్మబండలో జరిగిన శోభాయత్రలో
పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ


ఎల్లమ్మబండలో రాముల వారికి హారతి ఇస్తున్న
జగదీశ్వర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైట్‌ఫీల్డ్, సిగ్నేచర్ టవర్స్ పరిసరాలు, జయదర్శిని అపార్ట్‌మెంట్స్, మీనాక్షి అపార్ట్‌మెంట్స్, జయభేరి అపార్ట్‌మెంట్స్, కాసారోగ్ అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్ జూబ్లీగార్డెన్, అపర్ణా అపార్ట్‌మెంట్స్, భిక్షపతినగర్, రాఘవేంద్ర కాలనీ ఏ,బీ,సీ బ్లాక్స్, జాగృతికాలనీ, కొత్తగూడ విలేజ్, సఫారీనగర్, ప్రశాంత్‌నగర్, 8వ బెటాలియన్ ప్రాంతం, శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జర్నలిస్ట్ కాలనీలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

- ఖాజాగూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఖాజాగూడ, గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్స్, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- సాయిఐశ్వర్య, చర్చ్ ఐటీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిఐశ్వర్య లేఅవుట్, ఖాజాగూడ, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, ఖాజాగూడ, హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్, ఎస్ఏఎస్ కార్యాలయాలు ,నానక్‌రాంగూడ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వివరించారు.

మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల ప్రక్రియలో భాగంగా మంగళవారం ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విశ్వవర్మ కాలనీ, శిల్పా ఎవెన్యూ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: సుదర్శన్‌నగర్, డోయన్స్ కాలనీల ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.

- 11 కేవీ సుదర్శన్‌నగర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సుదర్శన్‌నగర్, భాగ్యలక్ష్మీ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11కేవీ డోయన్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు డోయన్స్ కాలనీ ఏరియాలో సరఫరా ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: ఎఫ్‌సీఐ, ఈ సేవా ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు టాకీటౌన్ ఏరియా, వీడియా కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, టిఎన్‌నగర్, అమాన్ కాలనీ, చిరంజీవి కాలనీ, అదే విధంగా మీసేవ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 గంటల నుండి 4.30 వరకు మియాపూర్ విలేజ్, వడ్డెర బస్తీ, ఎస్ఎంఆర్ మెట్రోపాలిస్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్ కుమార్ తెలిపారు.

ఆల్విన్‌కాలనీ పరిధిలో..

ఆల్విన్‌కాలనీ: ఆర్‌పి కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు పనుల్లో భాగంగా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు రామారావునగర్, మాధవరం నగర్, దీనబంధు కాలనీ, హనుమాన్‌నగర్, ప్రగతినగర్, రామకృష్ణనగర్, ఆర్‌పి కాలనీల్లో అదే విధంగా వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కమలప్రసన్ననగర్, ఆల్విన్‌కాలనీ, సాయినగర్ ఈస్ట్, వెస్ట్, రాఘవేంద్ర కాలనీ, సాయి కళ్యాణ మండపం, జయశంకర్ కాలనీ, విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీ, శుభోదయ కాలనీ, వెంకటేశ్వరనగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, వీకర్ సెక్షన్, దీనబంధు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పాటిలో బోగస్ ఓట్లను తొలగించండి

ఉప తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

పటాన్‌చెరు టౌన్: పాటి గ్రామంలో బోగస్ ఓట్లను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ నాయకులు గోపాల్‌యాదవ్, రజనీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం గ్రామ వార్డు సభ్యులతో కలిసి ఉప తహసీల్దార్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాసనసభ ఎన్నికల అనంతరం ప్రభుత్వం నూతన ఓటరు నమోదు కార్యక్రమం చేపట్ట స్థానికంగా నివాస ఆధారాలు లేకుండానే స్థానికేతర ఓట్లను నమోదు చేసినట్లు ఆరోపించారు.గ్రామంలోని 288 పోలింగ్ స్టేషన్‌లో బోగస్ ఓట్లను సృష్టించారన్నారు. బోగస్ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మధుసూదన్ రెడ్డి, కుమార్, శ్రీనివాస్ యాదవ్,చంద్రశేఖర్‌గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. రెండు వినతులు



హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెండు వినతిపత్రాలు వచ్చాయని ఉపకమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. అందులో ఒకటి టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించినది కాగా మరొకటి పీజేఆర్ స్టేడియంలో వసతులపై ఫిర్యాదులు చేశారన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని పేర్కొన్నారు.

అలరించిన రామ కీర్తనలు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శ్రీరామ కీర్తనలను ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. సోమవారం అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అన్నమయ్యపురంలో సీతారాములకు డాక్టర్ శోభారాజు పూజ చేశారు. అనంతరం శిష్యబృందం సంకీర్తనలతో ఆలరించారు. సంగీత సహకారాన్ని కళ్యాణ్ అందించారు.

ట్రిపుల్‌ఐటీలో 'ఈయూ' బృందం



రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌ను 'ఈయూ '(యూరోపియన్ యూనియన్) రాయబారి హెర్వే డెల్ఫిన్ బృందం సందర్శించింది. స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. నీరు, శక్తి, సోలార్, కాలుష్యం, వాతావరణం, ఆక్యుపెన్సీ/క్రౌడ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఈ ల్యాబ్ పనితీరుపై ఈ యూ బృందం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 5జీ, 4జీ, వైఫై, లోరవాన్, వైసన్ వంటి అంశాలపై ఈ ల్యాబ్ దృష్టి పెడుతుందని ట్రిపుల్‌ఐటీ ప్రతినిధులు ఈ బృందానికి వివరించించింది. వ్యర్థాల నిర్వహణపై పలు అంశాలను కూడా అడిగి ఈయూ బృందం తెలుసుకుంది.

9 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 09 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 6 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల జరిమానా.. అదేవిధంగా మరో ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొ న్నారు.

ట్రాఫిక్ కష్టాలు..

- రైల్వే అండర్ పాస్ విస్తరణలో జాప్యం
- తాత్కాలిక సిగ్నల్‌తో ట్రాఫిక్ జామ్‌లు


రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బారులు తీరిన వాహనాలు

హఫీజ్‌పేట్: రైల్వే అండర్‌బ్రిడ్జి కింద రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలినగర్ నుంచి బొటానికల్ గార్డెన్, మసీద్‌బండకు వెళ్లే లింకురోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. నిత్యం మదీనాగూడ, చందానగర్, మియాపూర్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళే వాహనాలకు ట్రాఫిక్‌తో పాటు సమయం ఆదా అవుతుందని ఇటుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటిరకు ఎస్ఆర్‌డీపీ కింద లింకురోడ్డు పూర్తి అయినప్పటికి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు విస్తరణ ఆగిపోయింది. ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ప్రత్యేక చొరవతో ట్రాఫిక్ సమస్యకు గత కొన్ని నెలల క్రితం తాత్కాలికంగా ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. కానీ ఉదయం, సాయంత్రం సమయాలలో ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. వైశాలీనగర్ నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు డివైడర్‌ను ఏర్పాటు చేయడంతో బాటు సిగ్నల్ వద్ద ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి.


వైశాలీనగర్ లింకురోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇరుకుగా మారిన రోడ్డు

సమస్యలు ఇవే..

- బ్రిడ్జి కింద రోడ్డు నిర్మాణంతో పాటు మురుగు నీటి కాలువ నిర్మించారు. కేవలం ఒక వాహనం వెళ్లే విధంగా ఉండడంతో తాత్కాలికంగా సిగ్నల్ ఏర్పాటు చేశారు.
- ఇరుకు రోడ్డులోనే నాలా ఏర్పాటుతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
- ట్రాఫిక్ సిగ్నల్ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి
- సిగ్నల్ సమయం తక్కువగా ఉండడం వల్ల కార్లు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇంకా ఎన్నాళ్లు..



ప్రేమ్‌నగర్ వెనుక ఉన్న లింక్ రోడ్డులో రైల్వే అండర్ పాస్ వద్ద రోడ్డు చిన్నదిగా ఉండడంతో ట్రాఫిక్‌తో సతమతమవుతున్నాం. ఫ్లైఓవర్ అంటూ ప్రజాప్రతినిధులు కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైన రైల్వే అండర్ పాస్ వద్ద రోడ్డు విస్తరించాలి. - వెంకటేష్, వాహనదారుడు

అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం



లింక్‌రోడ్డు నంబర్ –14లో రైల్వే అండర్‌పాస్ విస్తరణ కోసం రైల్వే అధికారుల అనుమతుల కోసం దరఖాస్తు పెట్టాం. అనుమతులు రాగానే రోడ్డు విస్తరణ పనులు చేపడతాం. అప్పటి వరకు ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్ సిగ్నల్‌తో పాటు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేశాం. - ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

జాతరలు సంస్కృతికి ప్రతీకలు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


ఎమ్మెల్యేను సన్మానించిన నిర్వాహకులు

పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు సంస్కృతికి ప్రతీకలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఐనోలు గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు సొంత నిధులతో దేవాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన వైద్య విధానాలతో సులువుగా చికిత్స

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: వైద్యరంగం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో న్యూరో ఎండోస్కోపీ మాస్టర్: బేసిక్స్ క్లినికల్ ప్రాక్టీస్ అనే అంశంపై హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన వైద్య విధానాలతో చికిత్సలు మరింత సులువు అయ్యాయన్నారు. ఈ కోర్సును కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హెచ్‌సీయూ సంయుక్తంగా బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ, ఎడ్యుకేషనల్ పార్టనర్‌గా ఏఈఎస్‌సీయూఎల్‌ఏపీ అకాడమీ, సన్‌ఫార్మా సహకారంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆస్పత్రుల వ్యవస్థాపకుడు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌రావు బొల్లినేని, న్యూరో సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ మానస్ పాణిగ్రహి, ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు, డాక్టర్ కేవిఆర్‌శాస్త్రి, ప్రొఫెసర్ ఆనంద్ కొండపి, జపాన్ ప్రతినిదులు డాక్టర్ నోబుహిటోమోరాటో,డాక్టర్ కె టేకుచి, పలువురు డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.